క్లుప్తంగా

చొక్కాకుల వెంకటరావుకు కె.కె.రాజు శుభాకాంక్షలు


వెంకటరావుకు మొక్కను బహూకరిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: విశాఖపట్నం–కాకినాడ పెట్రోలియం కెమికల్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితుడైన చొక్కాకుల వెంకటరావును గురువారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఆయన నివాసంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కలిసి సత్కరించారు. ఆయనకు మొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో 11 కేవీ ఏపీఎస్‌ఈబీ, 11 కేవీ నార్త్ ఎక్స్‌టెన్షన్ ఫీడర్‌లో మరమ్మతులు, చెట్లు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సీతమ్మధార అభయ ఆంజనేయ స్వామి ఆలయం, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్, ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్, ఆర్ అండ్ బీ క్వార్టర్స్, అల్లూరి సీతారామరాజు జంక్షన్, ఎస్‌బీఐ బ్యాంకు, కెనరా బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కాలభైరవుడికి ప్రత్యేక పూజలు


కాలభైరవ స్వామికి పంచామృతాభిషేకం


సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయి బాబా దేవాలయంలో కొలువైన కాలభైరవ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అమావాస్య సందర్భంగా ప్రధాన అర్చకుడు రాజాస్వామి, అర్చకుడు వంశీ పంచామృతా భిషేకం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు భక్తులకు దర్శనమిచ్చాడు.

కనకమ్మ ఆలయంలో అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: మార్గశిర మాసోత్సవాల ముగింపు సందర్భంగా శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం సీతంపేట కనకమ్మ(మూడు గుళ్లు) ఆలయంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ముందుగా అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో బోర ఈశ్వరరావు, సారిపిల్లి గంగరాజు, బోర వెంకటరమణ, నమ్మి వెంకట్, సారిపిల్లి సంతోష్, ముద్దాడ గోవింద్, మువ్వల పాపారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా


రైతులకు స్టాళ్ల టోకెన్లు అందజేస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు ఆధ్వర్యంలో డ్రా తీసి రైతులకు కేటాయించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న బజార్‌కు సంబంధించి కార్డుదారులకు స్టాళ్ల టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 66 మంది రైతుల స్టాళ్లకు డ్రా తీస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.


మురిపింఛన్

- కొత్త పెన్షన్ల మంజూరుతో లబ్ధిదారుల ఆనందం
- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు


46వ వార్డు లబ్ధిదారుకు పింఛన్ అందిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్(ఫైల్)


47వ వార్డు లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందిస్తున్న కె.కె.రాజు, కంటిపాము కామేశ్వరి(ఫైల్)

కులం, మతం, పార్టీలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను తూచా తప్పకుండా అమలు చేసి చూపిస్తున్నారు. ఇందుకు నిదర్శనమే గడిచిన నాలుగేళ్లలో రెట్టింపు పింఛన్లు మంజూరు కావడం. ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పింఛన్ పెంచి లబ్ధిదారుల కుటుంబాల్లో సంతోషాలు నింపారు.



కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారుల సంఖ్య పెరిగింది. పలువురికి కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. తొలిసారి రూ.3 వేల పింఛన్ సొమ్ము అందుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజవకర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు చేతుల మీదుగా కొత్త లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్ నగదు అందజేశారు.

46వ వార్డులో..

జీవీఎంసీ 46వ వార్డులో కొత్తగా 30 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యాయి. వారికి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ చేతుల మీదుగా పెన్షన్ల నగదు అందజేశారు. శాంతినగర్ సచివాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలన గురించి ప్రజలకు తెలియజేశారు.

47వ వార్డులో..

జీవీఎంసీ 47వ వార్డులో కొత్తగా 37 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యంలో కె.కె.రాజు లబ్ధిదారులకు కొత్త పింఛన్లు అందజేశారు.

కొత్త పింఛన్ల వివరాలు

వార్డు నం.	2023 నాటికి పింఛన్లు	పెరిగిన పెన్షన్లు	మొత్తం లబ్ధిదారులు
46	1,332	30	1,362
47	1,195	37	1,232
48	1,214	38	1,252

48వ వార్డులో ..

జీవీఎంసీ 48వ వార్డుకు సంబంధించి వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లు కొత్తగా 38 మందికి మంజూరైనట్లు జోన్–5 ఏపీడీ పద్మావతి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచి అందిజేయడంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపించింది.

దరఖాస్తు చేయగానే పింఛన్ మంజూరు



గతంలో పింఛన్ కోసం దరఖాస్తులు చేసుకున్నా ఫలితం ఉండేది కాదు. అధికారుల చుట్టు కాళ్లరిగేలా తిరిగినా ప్రయోజనం లేదు. మా ఏరియా పరిధిలోని సచివాలయంలో అర్హత గల ధ్రువపత్రాలతో దరఖాస్తు చేశాను. వెంటనే పింఛన్ మంజూరు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంతో రుణపడి ఉంటాను.

– సయ్యద్ అమీర్, తాటిచెట్లపాలెం, 46వ వార్డు

ఎంతో ఆనందంగా ఉంది



ఎంతోకాలం ఎదురుచూసినా రాని పింఛన్.. గడప గడప మన ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజుకు దరఖాస్తు ఇవ్వడంతో మంజూరు చేశారు. కొత్త పెన్షన్ అందుకుంటుంటే ఎంతో ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌కు, పార్టీ నేతలు, అధికారులకు నా కృతజ్ఞతలు.

– గుమ్మడి సూర్యకాంతం, కంచరపాలెం, 47వ వార్డు

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 45వ వార్డులో 'గుడ్ మార్నింగ్ నార్త్'


మృతురాలు లక్ష్మి భర్త సత్యంకు వైఎస్సార్ బీమా సొమ్ము అందజేస్తున్న కె.కె.రాజు


వాసుదేవనగర్‌లో మహిళతో మాట్లాడుతున్న సమన్వయకర్త కె.కె.రాజు

తాటిచెట్లపాలెం: గుడ్ మార్నింగ్ నార్త్ కార్యక్రమంలో భాగంగా గురువారం 45వ వార్డులో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు.. స్థానిక కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకుతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద నుంచి ఈ కార్యక్రమం ప్రారంభించారు. అక్కడ నుంచి నరసింహనగర్, పోర్టు క్వార్టర్స్, లక్ష్మీనారాయణపురం, వాసుదేవనగర్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కె.కె.రాజు తెలిపారు. నరసింహనగర్ పార్కులో పర్యటించి, అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. వెంటనే పార్కులో పచ్చదనం పెంపొందించేలా, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయం సిబ్బందికి సూచనలిచ్చారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె పరిష్కారమైనందున వార్డుతోపాటు నియోజకవర్గ పరిధిలో పేరుకుపోయిన చెత్తను యుద్ధప్రాతిపదికన తరలించాలని అధికారులకు సూచించారు.

పింఛన్లు, వైఎస్సార్ బీమా పంపిణీ

తాటిచెట్లపాలెంలోని 256 సచివాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను కె.కె.రాజు చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన వాసుదేవనగర్‌కు చెందిన గల్లా లక్ష్మి భర్త గల్లా సత్యం(లబ్ధిదారు)కు వైఎస్సార్ బీమా సొమ్ము రూ.లక్ష, పొదుపు డ్వాక్రా సొమ్ము రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.3 లక్షలను ఆయన అందించారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ భరణికుమార్, ఏఈ ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, ఆంధ్రప్రదేశ్ యాత వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ నాయకులు హరిపట్నాయక్, రాజు యాదవ్, బాబూరావు, నానిబాబు, జోగినాయుడు, సురేష్, ప్రభాకర్, శ్రీనివాస్, మాత ఈశ్వరరావు, వార్డు సీవోలు, ఆర్పీలు, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


వరాహగిరి కాలనీ కనెక్టింగ్ రోడ్డును పరిశీలిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు

కంప్యూటర్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కంచరపాలెం: అశోక్‌నగర్ బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మహిళలకు టైలరింగ్, యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు 96760 30455 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ బర్కత్ అలీ, ఫౌండేషన్ సభ్యులు

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్ దరి ఎఫ్‌సీఐ పార్కులో ఉత్కర్ష్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ బర్కత్ అలీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ఈ ఫౌండేషన్ పనిచేస్తోందన్నారు. ప్రజలందరూ పర్యావరణాన్ని కాపాడటంలో సహకరించాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి, గుడ్డ సంచులను ఉపయోగించాలని సూచించారు. మన చుట్టూ ఉన్న ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రత, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తడి, పొడి, హానికర చెత్తలను వేరువేరుగా జీవీఎంసీ ఏర్పాటు చేసిన చెత్త డబ్బాల్లోనే వేయాలని, తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోగలుతామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ షేక్ వసీమ్, హెల్త్ వలంటీర్ టి.అనూష, వైఎస్సార్‌సీపీ 53వ వార్డు నాయకులు సదరం జ్ఞానేష్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు


నో ఎంట్రీ బోర్డును సూచిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్, సీఐ మళ్ల అప్పారావు

మద్దిపాలెం: రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ బ్రిడ్జి వరకు బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో పలు వాహనాలకు అనుమతి లేదని నో ఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ మధ్య రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు ప్రయాణించడం వల్ల అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. మధ్య రోడ్డులో కేవలం బస్సులు, అంబులెన్సులు మాత్రమే ప్రయాణించాలని, దానికోసమే నో ఎంట్రీ బోర్డులను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతర వాహనాలు రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్డులో ప్రయాణించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే జరిమానా విధించి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జ్ఞానాపురం నుంచి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ వరకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశామని, వాటిని గమనించి వాహనాలు నడపాలని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఊరెళ్తే.. ఇల్లు జాగ్రత్త!

ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసుల ఆటో ప్రచారం


ప్రచార ఆటోను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ అప్పారావు

సీతమ్మధార: సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లేవారు తగు జాగ్రత్తలు పాటించాలని ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐ అప్పారావు కోరారు. ఇంటికి తాళం వేసి.. బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను బ్యాంకు లాకర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ మేరకు గురువారం ఫోర్త్‌టౌన్ క్రైం పోలీసులు ఆటో ద్వారా ప్రచారం చేశారు. పండగ వేళ ఎటువంటి నేరాలు జరగకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆటో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. మీ ఇంటికి, అపార్ట్‌మెంట్‌కు సీసీ కెమెరాలను అమర్చాలని, వాటి వల్ల నేరాలను నివారించేడమే కాకుండా, వాటిని ఛేదించేందుకు ఉపయోగపడుతుందన్నారు. మహిళలు బంగారు నగలు ధరించి ఒంటరిగా వెళ్లరాదని, వాకింగ్ చేసే సమయంలో పూర్తిగా నగలు కనిపించకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆటో, బస్సు ప్రయాణాల్లో విలువైన ఆభరణాలు, నగదు తీసుకెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ వాహనాలకు పోర్క్ లాక్, జీపీఎస్‌ను అమర్చాలని సూచించారు. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని డయల్ 100కు కాల్‌చేసి పోలీసులకు, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈస్ట్ క్రైం సీఐ సెల్ నంబర్ 83310 41656, ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్‌ఐ నంబర్ 73822 96913, ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ నంబర్ 0891 2710695లకు కాల్ చేయాలని సూచించారు.

ఈపీడీసీఎల్ అధికారులకు అభినందన


జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు క్యాలెండర్ అందిస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు

ఎంవీపీ కాలనీ: ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ఎల్.మహేంద్రనాథ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారుల సేవలను జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర కొనియాడారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎస్‌ఈతో పాటు ఏపీఈపీడీసీఎల్ తూర్పు పంపిణీ డివిజన్‌కు సంబంధించిన పలువురు ఉన్నతాధికారులు ఆమెను గురువారం జెడ్పీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ రూపొందించిన క్యాలెండర్‌ను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవల పురోగతి, పలు ప్రాజెక్టులు వేగవతంగా నిర్వహించడం పట్ల వారికి అభినందనలు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ వేళ.. సంతకాల సేకరణ


46వ వార్డులో ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


51వ వార్డులో ఫ్లెక్సీపై సంతకం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


వాసుదేవనగర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు

కంచరపాలెం: ఈ నెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకుని గురువారం పలు వార్డుల్లో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. 46వ వార్డు తాటిచెట్లపాలెం శాంతినగర్‌లో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం చిత్రపటానికి జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ అంబేడ్కర్ ఫ్లెక్సీపై వార్డులో సంతకాలు సేకరించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు అప్పారావు, నాయకులు కె.చిన్నా, ఎన్.కె.ఈశ్వరరావు, కె.రామారావు, లావణ్య, సీతయ్యరెడ్డి, ఎన్.వి.రమణ, దుర్గా భవాని, దేవి, కోదండ, విజయలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటావిష్కరణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు వాసుదేవనగర్‌లోని 256 సచివాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం చిత్రపటాన్ని ఆవిష్కరించి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడుస్తానని సచివాలయ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్లు శివకృష్ణ, రాజేష్, సచివాలయ సిబ్బంది, గోపి పాల్గొన్నారు.

44వ వార్డులో..

సీతంపేట: జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముస్లిం తాటిచెట్లపాలెం సచివాలయంలో సామాజిక సమతా సంకల్పం పేరిట సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఆయన సంతకాల సేకరించి


సంతకాల సేకరణలో పాల్గొన్న జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు

51వ వార్డులో..

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార వుడా కాలనీలోని 286 సచివాలయంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. వార్డులోని 286, 287, 288, 289, 290, 291 సచివాలయాల పరిధిలోని ప్రజలు కుల, మతాలకు అతీతంగా అందరూ పాల్గొని సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అక్కడ ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఫ్లెక్సీపై కార్పొరేటర్ సంతకం పెట్టారు. కార్యక్రమంలో కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో కూరగాయలు పండిద్దాం


కూరగాయల నారు మొక్కలతో మురళీనగర్ వాసులు

మురళీనగర్: ఇంటి వద్ద ఖాళీ స్థలాలతోపాటు మిద్దెపై కూరగాయలు పండిద్దామని మిద్దె పంటల సాగుదారులు పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఎన్‌జీజీవోస్ కాలనీలో మిద్దె పంటల సాగుదారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కూరగాయల మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. హరిత విశాఖను సాధిద్దామని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జీవీ రత్నం, 50 మంది మహిళలు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న మాక్సివిజన్ హాస్పటల్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక సేవా కార్యక్రమాలు, పూజలు జరిగాయి. మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి, మెడికవర్ హాస్పిటల్స్, సంధ్య డెంటల్ క్లినిక్‌ల సౌజన్యంతో ఉచిత వైద్య, కంటి శిబిరాలు నిర్వహించారు. ఆలయ సిబ్బందితో పాటు సుమారు 110 మంది భక్తులు పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ధ్యాన మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులు, పేదలకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు, కమిటీ సభ్యులు, హాస్పిటల్ వైద్య సిబ్బంది సునీత(ఆప్టోమెట్రిస్ట్), రుషిక(కౌన్సిలర్), కె.అప్పారావు(మార్కెటింగ్ అసోసియేట్), డాక్టర్ రేష్మ(డెంటల్ సర్జన్) తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ దృష్టికి వాకర్స్ పార్కు సమస్యలు


కార్పొరేటర్ ప్రసాద్‌కు పార్కు సమస్యలను వివరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాకర్స్ క్లబ్ సభ్యులు 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్‌కు విన్నవించారు. ముఖ్యంగా పారిశుద్ధ్య సిబ్బంది పార్కు ఉత్తరం వైపు ప్రహరీ గోడ వద్ద జేసీబీతో చెత్తను తొలగించినప్పుడు గోడ దెబ్బతిందని వారు చెప్పారు. దీన్ని వెంటనే మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. దీనిపై కార్పొరేటర్ ప్రసాద్ సానుకూలంగా స్పందించినట్లు క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. కార్పొరేటర్‌ను కలిసి వారిలో క్లబ్ కార్యదర్శి చెల్వరాజ్, జాలీ వాకర్స్ ప్రకాశరావు, సీహెచ్ ప్రసాదరావు ఉన్నారు.